

హైదరాబాద్ వార్త

# కళ్లద్దాల పేరుతో రోగులకు గంతలు..!

**-ఆసుపత్రిలో తిష్టవేస్తున్న ప్రైవేటు షాపుల ఏజెంట్లు -నాసిరకానివి అధిక ధరలకు అంటగడుతున్న వైనం**




**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త**

సరోజినీ దేవి ప్రభుత్వ నైత్ర వైద్యశాలలో కొందరు ప్రైవేటు కళ్లద్దాల దుకాణాలకు చెందిన ఏజెంట్లు తిష్ఠ వేస్తున్నారు. తక్కువ ధరకే ఇప్పిస్తామని తీసుకెళ్లి.. చాలా మందికి నాసిరకానివి అంటగడుతున్నారు. ఈ విషయం ఆసుపత్రిలోని ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో నిఘా పెట్టారు. క్యాటరాక్టు నుంచి ఇతర పెద్ద పెద్ద కంటి సమస్యలకు పేదలకు ఇక్కడ ఉచితంగా చికిత్స అందజేస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి రోగులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. శుక్లాలు, ఇతర కంటి సమస్యలతో బాధపడే రోగులు శస్త్ర చికిత్స కోసం నాలుగైదు రోజులు చేరి చికిత్స పొందుతారు. నిత్యం 1,250 మంది నుంచి 1,350 మంది రోగులు వస్తుండగా వారిలో 300 - 350 మంది వరకు రివ్యూ కోసం వచ్చేవారు ఉంటారు. ప్రభుత్వం నుంచి కళ్లద్దాల సరఫరా లేకపోవడంతో.. చికిత్సలు, మందులు ఉచితంగా ఇస్తున్నా.. అద్దాలను బయట కొనుక్కోమని రాస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి చుట్టూ ఉన్న షాపులకు చెందిన బ్రోకర్లు పేదలను బురిడీ కొట్టిస్తున్నారు.

**రెండు మూడు రెట్లు ధరలకు అమ్ముతూ..**

రోజూ దాదాపు 300మంది రోగులకు కంటి అద్దాలు ధరించాలని సిఫార్సు చేస్తుంటారు. ఆస్పత్రి ప్రధాన గేటు, ఓపీ, ఇతర విభాగాల వద్ద రోగుల కోసం కాపు కాస్తున్న బ్రోకర్లు, కొందరు సొంత దుకాణాలకు చెందినవారు తక్కువ ధరకు ఇప్పిస్తామంటూ తీసుకెళ్తున్నారు. రీడింగ్, ప్రోగ్రెసివ్.. అందులో లెన్స్‌పై చాలా మందికి అవగాహన లేక రూ.250లు, రూ.300లు విలువైన అద్దాలను రూ.500లు, రూ.1000లకు తీసుకుంటున్నారు. వారం తర్వాత అవి సరిగా కనిపించడంలేదని రోగులు తిరిగి ఆసుపత్రులకు వస్తుండటంతో అక్రమాలు బయటపడుతున్నాయి.

దీనిపై అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగంను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఆసుపత్రిలోకి కొందరు ఏజెంట్లు ప్రవేశిస్తు న్నట్లు తెలిసిందన్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

# వివరాలు గోప్యం..మృతదేహాలు మాయం



**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:**

గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను, శరీర అవయవాలనూ మెడికల్ కాలేజీలకు విక్రయించే చీకటి వ్యాపారానికి వారధులుగా పలువురు హెల్త్ ఇన్స్‌పెక్టర్లు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌లు (ఆర్‌ఎంఓ) వ్యవహరిస్తున్నట్లు వరుస అనుమానా లూ, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో మృ తుల కేసుల్లో బయట పడని మెడికల్ మాఫియా లో అధికారుల హస్తం కూడా ఉన్నట్లు మిస్సింగ్ కేసులుగా మారిన పలు విషాద సంఘటనలు రుజువు చేస్తున్నాయి. చనిపోయిన వ్యక్తుల వివరా లు తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్లో అందజేసి, గవర్నమెంట్ ఆసుపత్రి నోటీస్‌బోర్డులో పెట్టే పద్దతిని పూర్తిగా మార్చేశారు ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు. హెల్త్ ఇన్స్‌పెక్టర్లు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌లు తమ విధినిర్వహణలోని భద్రతను, గోప్యతను అడ్డం పెట్టుకుని గుర్తుతెలియని మృతదే హాల వివరాలు బయటకు పొక్కనీయట్లేదు. పబ్లిక్ ఇష్యూ ప్రకటనలలో పేర్కొవాల్సిన ఎన్నో రకాల మిస్సింగ్ కేసులు, లేదా వేరు వేరు పరిస్థితుల్లో గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు మార్చురీకి వస్తే, వాటి వివరాలను నమోదు చేసిన రికార్డుల ను గోప్యంగా ఉంచుతున్నారు తప్ప నోటీసు బోర్డుల్లో తెలపడం గానీ, స్థానిక పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించడం గానీ చేయట్లేదనే ఆరోప ణలు ఎందరో సామాన్యుల నుంచి, ఎన్ జీ ఓల నుంచి వెల్లువెత్తుతున్నాయి. మిస్సింగ్ కేసుల్లో ప్రభుత్వ ఆసుపత్రికి అనుమానంతో వచ్చిన వారికి ఆచూకీ దొక్కుండా చేస్తూ, జీహెచ్‌ఎంసీ వారికి మృతదేహాన్ని అప్పగించామనే మసిపూసిన మారే డుకాయ సమాధానంతో ఆర్‌ఎంఓలు నేరాలకు నాంది పలుకుతున్నట్లు తెలుస్తోంది. తద్వారా గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు రాయని రహస్యాలుగా ఆసుపత్రి మార్చురీల్లోనూ, మెడికల్ కాలేజీ అనాటమీ లేబొరేటరీల్లోనూ మిగిలిపోయి కాలగర్భంలో కలిసిపోతున్నాయి.

**ఫిబ్రవరిలో మరణం, జూన్‌లో ఆచూకీ :**

2023 డిసెంబరులో తప్పిపోయిన వ్యక్తి ఫిబ్రవరి లో మరణించగా, జూన్ చివరి వారంలో ఆచూకీ లభ్యమైన వైనం చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, సైదాబాద్‌కు చెందిన అజీమ్ ఖాన్ అనే వృద్ధుడు డిసెంబర్ 23న అల్జీమర్స్ కారణంగా ముసారాం భాగ్ మలక్‌పేట ప్రాంతంలో తప్పిపోయాడు. ఈ మేరకు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోద యింది. అప్పటి నుంచి అజీమ్ ఖాన్ ముగ్గురు కుమారులతో పాటు ఇతర కుటుంబీకులు అతడి ఆచూకీ కోసం వెతుకుతూనే ఉన్నారు. ఈ క్రమంలో 2024 ఫిబ్రవరిలో అజీమ్ ఖాన్ చనిపోయి నట్లు తెలియగా అతని కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. గుర్తు తెలియని మృతదేహం పేరుతో తమ తండ్రికి సంబంధించిన ఏ వివరాలు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అతని కుటుంబీకులకు అందకపోవడం విచారకరం. అజీమ్ ఖాన్ మృత దేహం దొరకకపోవడంతో అతని కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇటువంటి ఘటనే అత్తాపూర్‌లో మరొకటి జరిగింది. మార్చి నెలలోని అత్తాపూర్ రింగ్ రోడ్డు వద్ద తప్పి పోయిన మహమ్మద్ అహ్మద్(49)ను వెతికిన అతని కుటుంబం, జూన్ నెలలో గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాల జాబితాల్లో ఆచూకీ కనుగొ న్నారు. మిస్సింగ్ కేసుల్లో వ్యక్తులు చనిపోయిన ఘటనలు నగర పరిధిలో ఏడాదికి వెయ్యికి పైగా నమోదవుతుండడం గమనార్హం. నగర పరిధిలో ఒక్క జూన్ నెలలోనే 152 మిస్సింగ్ కేసులు, 130 గుర్తు తెలియని వ్యక్తుల మరణాలు నమోదవ్వగా, 12 మంది ఎటువంటి వివరాలు లేని రోగు లు ఆసుపత్రిల్లో చేర్చబడినట్లు సమాచారం.

# నేటి నుంచి "మిడ్ డే అటెండెన్స్"

**-జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగంలో కొత్త పద్ధతి**
**-అక్రమాలను అరికట్టేందుకు ఉన్నతాధికారుల చర్యలు**
**-రోజుకు మూడు సార్లు కార్మికుల హాజరు తప్పనిసరి**
**-ఉదయం 10-30 నుంచి 11మధ్యలో తీసుకునేలా ఆదేశం**



దోమల్‌గూడ ఏరియాలో ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు చేస్తున్న ఎస్ఎఫ్ఏ (ఫైల్)

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:**

జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగంలోని కొందరు కింది స్థాయి ఉద్యోగులు, కార్మికులు కుమ్మక్కై హాజరు నమోదులో అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో హాజరు నమోదు ప్రక్రియలో నమోదు చేసుకుంటున్న అక్రమాలకు చెక్‌పెట్టేందుకు అధికారులు కొత్త పద్ధతిని ప్రవేశపెట్టారు. "మిడ్‌డే అటెండెన్స్"పేరుతో మరోసారి కార్మికుల హాజరు నమోదు చేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు విధుల్లోకి రాగానే ఉదయం 5-6 గంటల మధ్య ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు చేస్తుండగా విధులు ముగించుకుని వెళ్లటప్పుడు మధ్యాహ్నం 1-2గంటల మధ్యలో మళ్ళీ హాజరు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో పలువురు కార్మికులు హాజరు అయిపోగానే పనిచేయకుండా మధ్యలో వెళ్ళిపోతున్నారన్న విమర్శలు వస్తుండటంతో ఉదయం 10.30నుంచి 11గంటల మధ్యలో మరోసారి హాజరు తీసుకోవాలని అధికారులు ఎస్ఎఫ్ఏలను ఆదేశించారు.

**మధ్యలో వెళ్ళిపోవడం కుదరదు..**

నిన్నటివరకు కేవలం రెండుసార్లు మాత్రమే కార్మికులు ఫేస్ రికగ్నిషన్ పద్దతిలో హాజరు నమోదు చేస్తున్నారు. నేటినుంచి ప్రవేశపెట్టే ఈపద్దతి ద్వారా ప్రతి కార్మికుడు మరోసారి హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. అంటే డ్యూటీలో చేరాక మొత్తం మూడుసార్లు హారు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రతినాలుగు గంటలకు ఒకసారి హాజరు నమోదు పెడితే కార్మికులు మధ్యలో ఎటూవెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ఇటీవల శానిటేషన్ విభాగంలో చోటుచేసుకుంటున్న అక్రమాలకు పుల్‌స్టాప్ పెట్టేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా వెళ్ళి తనిఖీ చేశారు. దీంతో పలువురు కార్మికులు హాజరు నమోదు అయినప్పటికీ ఫీల్డ్‌లో లేకపోవడం అటువంటి వారిని గుర్తించి ఎస్ఎఫ్ఏలను హెచ్చరించారు. అలాగే ఫేస్ రికగ్నిషన్ పద్దతిన హాజరు నమోదులో జూన్ 14,15 తేదీల్లో సాంకేతిక లోపం ఏర్పడింది. 14వ తేదీ ఉదయం ,మధ్యాహ్నం రెండుసార్లు 15వతేదీ ఉదయం హాజరు నమోదు చేసే సమయంలో మొత్తం మూడుసార్లు సాంకేతిక లోపం ఏర్పడింది. అది ఫీల్డ్‌లో హాజరు తీసుకునే ఎస్ఎఫ్ఏలకు తెలిసినప్పటికీ దీన్ని ఆసరగా చేసుకున్న కొందరు కార్మికులు అక్రమంగా హాజరు నమోదుకు 80సార్లు అటెమ్ట్ చేశారు. దీంతో వారెవరనేదానిపై జిహెచ్ఎంసి అధికారులు ఏజెన్సీకి,క్రింది స్థాయి అధికారులకు నోటీసులు జారీ విచారిస్తున్నట్లు తెలుస్తుంది.

**హాజరు నమోదు ఇలా...**

బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్‌పై పలు విమర్శలు రావడంతో ఫేసియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్ ద్వారా శానిటేషన్ విభాగంలో పనిచేసే 16.978మంది కార్మికుల హాజరును గత ఏప్రిల్ నుంచి నమోదు చేస్తున్నారు. ఇది పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై పనిచేస్తుంది. ఫేషియల్ రికగ్నిషన్‌తో హాజరు తీసుకునే సమయంలో కార్మికులు తమ ముఖం చూపి,కండ్లు బ్రింక్ చేస్తేనే హాజరు నమోదువుతుంది. అలాగే లైవ్‌నెస్ డిటెక్షన్‌తో ముఖలక్షణాలతో మార్పులను ధ్రువీకరిస్తుంది. దీంతో కార్మికులు ఇతర ప్రాంతాల్లో ఉండి కూడా హాజరు వెసుకునే అవకాశం ఉండదు. ఒకవేళ అలా చేస్తే కార్మికులతోపాటు సంబంధిత ఎఫ్ఎస్ఏలు ఉన్నతాధికారుల చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇలా కార్మికులు తాము పనిచేసే ప్రాంతాల్లోనే మూడుసార్లు తప్పనిసరిగా హాజరు నమోదు చేస్తే హాజరు పారదర్శకంగా నమోదయ్యే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

# వీడిన యువ ఇంజనీర్ హత్యా మిస్టరీ

**- ఇంజనీర్‌ను పథకం ప్రకారమే హత్య చేసిన నిందితులు**

**నార్సింగి, జూలై 1 ప్రభాతవార్త :** రెండు రోజుల క్రితం నార్సింగి ప్రాంతంలో సంచలనం సృష్టించిన దుబాయ్ ఇంజనీర్ హత్యా మిస్టరి వీడింది. ఈ హత్యలో పాల్గొన్న ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. గోల్కొండ చోటా బజార్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖాజా అలి కుమారుడు సయ్యద్ హిదాయత్ అలీ(31) దుబాయ్‌లో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. బక్రీద్ పండగ కోసం దుబాయ్ నుంచి గోల్కొండకు వచ్చాడు. హిదాయత్ అలీ ఎదురింట్లోనే మహ్మద్ ఆసిఫ్ భార్య సీమాబేగం అలియాస్ సీమ(24) ఉంటుంది. ఆమె ఫోన్ నెంబర్ తీసుకొని నిన్ను కలువాలని, ఇద్దరం సరదాగా గడిపేందుకు కారులో బయటకు వెళ్దామని బలవంతం చేశాడు. దీంతో సీమ తను అక్రమ సంబంధం నెరపుతున్న ఫలక్‌నుమాకు చెందిన సయ్యద్ అఫ్జల్ కుమారుడు సయ్యద్ అమీర్(29)కు తన ఇంటి ఎదురుగా ఉన్న హిదాయత్ అలీ నన్ను ఇబ్బంది పెడుతున్నాడని చెప్పింది. విషయం తెలుసుకున్న అమీర్ కోపగ్రస్థుడై ఎలాగైనా హిదాయత్‌ను చంపేద్దామని నిర్ధారించుకున్నాడు. బయటకు వెళ్లి కలుద్దామని హిదాయత్‌ను గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకు రావాలని సీమకు ఆమిర్ సూచించాడు. దీంతో సీమ బయటకు వెళ్దామని హిదాయత్‌కు చెప్పి, గోల్కొండ కోట బస్టాపు వద్ద నిల్చుంది. హిదాయత్ తన తండ్రి కారును తీసుకొని గోల్కొండ కోట వద్ద సీమను ఎక్కించుకొని మంచిరేవుల వద్దకు వచ్చాడు. వీరిని గమనిస్తూ కారు వెంటనే ద్విచక్రవాహనంపై ఆరిఫ్ వచ్చాడు. నిర్మానుష్య ప్రాంతానికి రాగానే హిదాయత్, ఆరిఫ్‌ల మధ్య గొడవ జరిగింది. ముందస్తుగానే వెంట తెచ్చుకున్న కత్తితో ఆరిఫ్ హిదాయత్ అలీపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. పూర్తిగా చనిపోయాడని నిర్ధారించుకున్న తరువాత సీమను తీసుకొని తన ద్విచక్రవాహనంపై పారిపోయారు. స్థానికులు 100.కు ఫోన్ చేసి ఓ వ్యక్తిని హత్య చేశారని సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నార్సింగి పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి పాకెట్‌లో లభించిన పాన్ కార్డు ఆధారంగా ఆయన చిరునామాను తెలుసుకున్నారు. హత్య జరిగిన స్థలంలో లభించిన ఆధారాలు, ఫోన్ కాల్స్ ఆధారంగా దర్యాప్తు చేయగా, హంతకులైన సీమ, ఆరిఫ్‌ల వివరాలు తెలశాయి. హంతకులు ఇద్దరిని నార్సింగి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి తమదైన శైలిలో విచారించగా వారు నేరంను అంగీకరించారు. దీంతో ఇరువురిని రిమాండ్‌కు తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

# పివి ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్‌పై పల్టీలు కొట్టిన కారు

**-యువకుడి మృతి...మరో యువకుడికి గాయాలు**

**అత్తాపూర్ జూలై1,ప్రభాతవార్త :** పివి నర్సింహ్మా రావు ఫ్లై ఓవర్‌పై కారు పల్టీలు కోట్టి ఒకరు దుర్మణం చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలిసు స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది.సమాచారాన్ని అందుకున్న పోలిసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.పోలిసుల వివరాల ప్రకారం...మెహదీపట్నం నుండి ఆరంఘర్ వైపు వెళ్తన్నా మైలర్‌దేవ్‌పల్లి బృందావన్ కాలనీకి చెందిన సాయి గణేష్ (25) టీఎస్ 07 జేవి 6055 నెంబర్ థార్ కారును వేగంగా నడిపూతూ 294 పిల్లర్ వద్దకు రాగానే రోడ్డు మలుపు ఉందని గమనించని యువకుడు వేగాన్ని అదుపు చేయలేక స్తంభాన్ని ఢీకొట్టి కారు పల్టీలు కోటిందని తెలిపారు.ఈ ప్రమాదంలో సాయిగణేష్ అక్కడికక్కడే మృతిచెందగా మరోకరికి తీవ్ర గాయలైయ్యాయి. ఘటనలో మృతి చెందిన సాయి గణేష్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలిసులు వెల్లడించారు.

# యువకుడిపై కత్తి దాడి

**అత్తాపూర్ జూలై1,ప్రభాతవార్త :** ఇద్దరు యువకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలిసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలిసుల వివరాల ప్రకారం...అత్తాపూర్‌లోని పిల్లర్ నెంబర్ 245 వద్ద ఇద్దరు యువకులు చాయ్ తాగుతుండగా చిన్న విషయంలో మాటమాట పెరిగి ఒకరిపై మరోకరు దాడి చేసుకున్నారని అంతటితో ఆగకుండా ఓ యువకుడు ఇంట్లో ఉన్న కత్తి తీసుకొని వచ్చి మరో యువకుడిపై పోడిచాడు.స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలిసులు గాయాలైన యువకుడిని ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలిసులు వెల్లడించారు.

# మెట్రోకు గోల్డెన్ పీకాక్ అవార్డు



**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త**

నగరంలో మెట్రో రైలు సేవలను అందిస్తున్న ఎల్ అండ్‌టీ మెట్రో రైలు సంస్థకు గోల్డెన్ పీకాక్ అవార్డు లభించింది.బెంగళూరులో ఇటీవల నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ 25వ ఇంటర్నేషనల్ కాన్ఫరేన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్ కార్యక్రమంలో పురస్కారాల ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ మెట్రో ఎండీ, సీఈవో కెవిబిరెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ భద్రత ప్రమాణాలు, పని ప్రదేశంలో ఆరోగ్యకరమైన పరిస్థితులను పాటించడానికి ప్రాధాన్యత ఇవ్వడంలో తమ బృందం చేసిన నిరంతర కృషికి గుర్తింపుగా గోల్డెన్ పీకాక్ అవార్డు వచ్చిందని తెలిపారు. మొత్తం 778 దరఖాస్తులు రాగా అందులో ఎల్ అండ్ టీ మెట్రోకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మునుముందు అత్యుత్తమ భద్రతా ప్రమాణాలను కొనసాగించడంలో తమ ఉద్యోగులు నిరంతరం పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలను త్వరగా పరిష్కరించండి

**-అధికారులకు డిప్యూటీ మేయర్ ఆదేశం**



ఆర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తులను త్వరగతిన పరిష్కరించాలని,అందుకు ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ హాజరై జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో కలిసి ఆర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫోన్ ఇన్‌ప్రోగ్రాం ద్వారా 16 విన్నపాలురాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. అలాగే ప్రజావాణి కార్యక్రమంలో 53 ఆర్జీలు రాగా అందులో సి.ఓ.వో హెచ్ సెక్షన్ 3,టౌన్‌ప్లానింగ్ 21,ఇంజనీరింగ్ 9,ఎస్టేట్ 3,టాక్స్ సెక్షన్ 9, లేబర్ వెల్ఫేర్ సెక్షన్ 2, ట్రాన్స్‌పోర్టు 1 ,అడ్మిన్ 1, ఎల్‌ఏవో సెక్షన్ 3, అడ్వైర్టైజ్‌మెంట్ 1, స్పోర్ట్స్1 వచ్చాయి. మొత్తం ఆరుజోన్లలో కలిపి4 87 ఆర్జీలు వచ్చాయి. చార్మినార్‌లో 5, సికింద్రాబాద్ లో 12, కూకట్‌పల్లి 37,శేరిలింగంపల్లి 33, ఖైరతాబాద్ 8, ఎల్బీనగర్ 2విజ్ఞప్తులు వచ్చాయి. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.శ్రీవాత్సవ, నళిని పద్మావతి, గీతారాధిక, యాదగిరి రావు, సునందరాణి, సిసిపి రాజేంద్రప్రాద్ నాయక్, సిఎంఅండ్‌వో డాక్టర్ పద్మజ, ఛీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, టాక్స్ వాల్యువేషన్ ఆఫీసర్ కులకర్ణి, సిఈ కె.ఎస్‌రెడ్డి ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# లోపాలు గుర్తించే "థర్మో విజన్ కెమెరా"

**-35 కెమెరాలు కొనుగోలు చేసి సిబ్బందికి అందజేత**
**-లోపాలను గుర్తించి త్వరగా పరిష్కరించే అవకాశం**



**హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త:**

కరెంట్ తీగలల్లో కంటికి కనిపించని లోపాలు అనేకం ఉంటాయి. ఈలోపాలను నిరంతరం విద్యుత్ సిబ్బంది పరిశీలిస్తున్నా ..కొన్నింటిని మాత్రం గుర్తించలేకపోతారు. వీటివల్ల తీగలు వేడెక్కడం, కాలిపోయి మంటలు రావడం, గృహోపకరణాలు కాలిపోవడం, నిత్యం విద్యుత్ అంతరాయాలు ఏర్పడటం వంటివి జరగుతున్నాయి. వీటన్నింటిని అదిగమించేందుకు ఆలోపాలను పరిశీలించేందుకు తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టిజిఎస్‌పిడిసిఎల్ ) థర్మల్ విజన్ కెమెరాలను ప్రవేశపెట్టింది. కొత్తగా 35 అత్యాధునిక థర్మోవిజన్ కెమెరాలను కొనుగోలు చేసి వాటిని ఏఈలకు అందజేసింది. ఈకెమెరాల ద్వారా ఓవర్‌లోడ్ లైన్లు, బ్రేకర్లు, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ద్వారా స్కాన్ చేసి సమస్య ఎక్కడ ఉంది.. ఎంత తీవ్రత ఉందో తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా విద్యుత్ తీగల నుంచి వెలుబడే ఉష్ణోగ్రతను థర్మల్ కెమెరాలు సంగ్రహించి థర్మల్ ఇమేజింగ్ చిత్రాలు అందిస్తాయి. దీని ఆధారంగానే ఉష్ణోగ్రతీ తీవ్రతను గుర్తించి అక్కడ ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటారు.

**సిబ్బందికి పెనుసవాల్‌గా లైన్ల గుర్తింపు..**

హైదారాబాద్ నగరంలో 57వేల సర్క్యూట్ కిలోమీటర్ల ఎల్‌టిలైన్లు, 22వేల సర్క్యూట్ కిలోమీటర్ల 11కేవీ లైన్లు , 5వేల కిలోమీటర్ల 33కేవీ తీగలు ఉన్నాయి. వీటిని విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నా,చాలా చోట్ల మాత్రం లోపాలను గుర్తించలేకపోతున్నారు. దీంతో తీగలు కాలిపోయి మంటలు రావడం, తీగలు వేడెక్కడం, మరమ్మత్తులకు ఎక్కువ సమయం పట్టడం ,ఇంట్లో ఉండే వస్తువులు కాలిపోవడం జరుగుతున్నాయి. ఈసమస్యను నివారించేందుకు తీగలు కాలేదశకు ముందే నివారించే విధంగా డిస్కం చర్యలు తీసుంటుంది.

**విద్యుత్ సరఫరాలో అధిక విశ్వసనీయత : సిఎండీ ముషారఫ్ ఫరూఖీ**



ఊహించని విద్యుత్ అంతరాయాలను, ప్రమాదాలను తగ్గించేందుకు థర్మోవిజన్ కెమెరాలు ఉపయోగపడతాయి. వీటిద్వారా ఉదయమే కాకుండా రాత్రి పూట కూడా లైన్లలో తనిఖీలు చేయొచ్చు. దీంతో రెడ్ హాట్స్ గుర్తించి సిబ్బంది సరిచేసే అవకాశం ఉంటుంది. ఇలా చేయడం ద్వారా విద్యుత్ అంతరాయాలను తగ్గించి విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ విశ్వసనీయతను పెంచుతుంది.

# నిజాంపేట్ కార్పొరేషన్‌లో అట్టకెక్కిన అధికారుల పాలన..

**-వర్షాకాలం ప్రారంభమైన నోచుకోని నాళాల, మ్యాన్‌హోల్స్ క్లీనింగ్..**
**-కాలనీలలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు..**
**-పట్టించుకోని ప్రజాప్రతినిధులు..**





పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

**నిజాంపేట్, జులై 1, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట ముస్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా మారింది. పేరుకే మోడల్ ముస్సిపల్ కార్పొరేషన్ కానీ ఎక్కడి సమస్యలు అక్కడే కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్నా అభివృద్ధికి ఆమడదూరంలో కొట్టుమిట్టాడుతోంది. కార్పొరేషన్‌లోని 33 డివిజన్లు ఉన్నాయి. అసెంబ్లీ ఎలక్షన్ల తరువాత కార్పొరేషన్‌లో అభివృద్ధి పరుగులు పెట్టించడం కోసమే బీఆర్ఎస్ నుండి అధికార పార్టీలోకి మారామని చెప్పుకుంటున్న ప్రస్తుత కార్పొరేటర్లు, వారి సొంత దందాలను, పదవులను కాపాడుకోవడం కోసమే పార్టీలు మారుతున్నారని విమర్శలు లేకపోలేదు. మరి కొంతమంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు నాలుగున్నర సంవత్సరాలు పదవిలో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించని వారు సైతం ప్రజా సమస్యలపైన పోరాడుతామని కొత్త రాగాన్ని అందుకుంటున్నారు. ఎంతో ఆర్భాటంగా దాదాపు 100 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభించిన ఎస్ఎన్‌డిపి పనులు అరకొరగా పూర్తి చేసినా మళ్ళీ చినుకు పడితే చిత్తడిగానే మారుతున్న దుస్థితి నెలకొంది. కాలనీలోనే వివిధ ప్రాంతాలు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్న ఇక్కడి అధికారుల పనితీరు నిదర్శనంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వానలొస్తే ఆగమాగం..**

వర్షాకాలంలో కార్పొరేషన్‌లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని అధికారులు, ప్రజాప్రతినిధుల ఉతదంపుడు మాటలకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొందనీ ప్రజలు మండిపడుతున్నారు. వేసవిలో చేపట్టాల్సిన నాలాల పూడికతీతలు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో ఇప్పుడు చిన్నపాటి వర్షానికే నాలాలు నిండి.. రోడ్లపై డ్రైనేజీలు పొంగే పరిస్థితి నెలకొంది. వాటిపై దృష్టి పెట్టకపోవడంతో కాలనీలు, ప్రధాన రోడ్లగుండా మురుగునీరు ఏరులై పారుతుంది. దీనికి తోడు దోమల విజృంభణతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇక్కడి కార్పొరేషన్ పాలక మండలి స్పందించి నాలాల క్లీనింగ్ డ్రైనేజీ మూతల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులను వెంటనే చేయాలని వర్షాకాల సమయంలో వివిధ కాలనీలలో డ్రైనేజీ పొంగిపొర్లడం ద్వారా దోమలు పెరిగి కాలనీలోని ప్రజలు వివిధ సీజనల్ సంబంధిత రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వైద్యులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం

**గజ్వేల్ టౌన్, జులై 1 (ప్రభాతవార్త):** శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద సోమవారం డాక్టర్స్ డే, చాటర్ అకౌంట్స్ డే సందర్భంగా డాక్టర్లను, చాటర్ అకౌంట్స్ వారిని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్, వాసవి యూత్ క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి పాల్గొని మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉప్పల మెట్టయ్య, డాక్టర్ లింగం, డాక్టర్ మల్లయ్య, సిద్దిబిక్షపతి, ఎర్రం శ్రీనివాస్, కొమురవెల్లి శంకరయ్య, ఉప్పల కృష్ణమూర్తి, గుడాల రాధాకృష్ణ, నాగేంద్రం, సిద్ది నవీన్, జిల్లా ప్రసాద్, కైలాస ప్రశాంత్, ఉమేష్, మర్యాల అనిత, తేరాల పద్మ, మహంకాళి చంద్రకళ, జగ్గయ్యగారి లత తదితరులు పాల్గొన్నారు.

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ క్యాంప్**

డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ క్యాంప్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పాల్గొని మాట్లాడుతూ మనకు తల్లిదండ్రులు జన్మనిస్తే పునర్జన్మను ప్రసాదించేది వైద్యులు అని, మానవ జన్మలో ఉన్న డాక్టర్లు దైవంతో సమానమని, వారిని గౌరవించాలని అన్నారు. అలాగే నూతనంగా ఎన్నికైన లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రజ్ఞ కార్యవర్గ సభ్యులను అభినందించారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

**వైస్ ఎంపిపి దేవి రవీందర్**



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దేవి రవీందర్

**కొండపాక, జులై 1, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎంపిపి ఉపాధ్యక్షుడు, ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం ప్రాథమికోన్నత పాఠశాలల్లో గత కొన్ని సంవత్సరాలుగా పని చేసిన ఉపాధ్యాయురాలు కవిత బదిలీపై వెళ్లడంతో ఆమెను సోమవారం ఘనంగా అయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు చేసిన సేవలే మంచి పేరును తెచ్చిపెడతాయన్నారు. గత 14 సంవత్సరాలుగా మా పాఠశాలకు ఉపాధ్యాయురాలు కవిత చేసిన సేవలను మేము మరిచిపోమన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం ముక్తేంధర్‌రెడ్డి, గ్రామస్తులు సంతోష్, అరవింద్, డాక్టర్ నర్సింలు, బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన



భవన సమదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

**నర్సాపూర్ జులై 1. ప్రభాతవార్త :** మండల పరిషత్ కార్యాలయం ముందుగల ప్రదాన రోడ్డులో మండల పరిషత్ కాంప్లెక్స్ భవన సముదాయాల నిర్మాణాలకు సోమవారం శంఖుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్,ఎ ంపిడివో మధులత, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి ల చేతుల మీదుగా ఈ భవన సముదాయాల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి శంఖుస్థాపన చేయడం జరిగింది. ఈమేరకు మండల పరిషత్ కాంప్లెక్స్ భవన సమదాయాల నిర్మాణానికి గాను నిధులు ఎంపిపి మరియు ఎస్ఎఫ్‌సి నుండి 8 లక్షల 28 వేల అంచనా వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఈ మండల పరిషత్ కాంప్లెక్స్ భవన సముదాయాల నిర్మాణంతో మండల పరిషత్ కు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఈమేరకు ఈ భవన సముదాయాల నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలోఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్,ఎంపిడివో మధులత, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి ల తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్గం, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్త,రుస్తుంపేట ఎంపిటీసీ లక్ష్మి అశోక్, మాజీ ఎంపిపి లలితనర్సింగ్‌నాయక్, నాయకులు ఉదయ్‌కుమార్, అజ్మత్ రాదాకృష్ణాగౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు సురభి వినోద, రవినాయక్, ఎంపివో వైద్య శ్రీనివాస్, మండల పరిషత్ సూపరిండెంట్ మనోహర్, కార్యదర్శిశ్రీఇవాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ

**మనిపల్లి, జులై 1, ప్రభాతవార్త:** డాక్టర్స్ డేతో పాటు తన పుట్టినను పుష్కరించుకుని తెలంగాణ మంజీరా రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుఉ కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ సోమవారం సదాశివపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, సత్యనారాయణ, అనిల్‌కుమార్ సంతోష్, వెంకట్రామిరెడ్డి, మదులత, ప్రవళిక, వంశీ నవీన్, అభిజిత్, స్నేహితులు గంట శివయ్య, శనిగిరి శంకర్, సంగమేశ్వర్, రవి తదితరులు ఉన్నారు.

## నర్సాపూర్‌లో ఘనంగా డాక్టర్స్ డే

**నర్సాపూర్, జులై 1, ప్రభాతవార్త :** నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా గ్రేస్ ఇండియా అధ్వర్యంలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని డాక్టర్లందరికి శాలూవాలతో సన్మానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి డాక్టర్స్ డే ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రెస్ ఇండాయా పౌండేషన్ సభ్యులు లక్ష్మణ్ పాల్,ప్రేమ్‌కుమార్, సాగర్, కిరణ్, డాక్టర్లు వీణ, వంశీకృష్ణ, రాజేవ్‌కుమార్, వీర జాదవ, మీర్జా, శ్రీలేఖ, రామ్, అమరేందర్, మాదవి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్‌లను సన్మానించిన గ్రేస్ ఇండియా సభ్యులు తదితరులు

# ప్రభుత్వ పథకాలు అందరికి అందించాలి : ఎమ్మెల్యే



పదవీ కాలం ముగిసిన ఎంపిటీసిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, జులై 1, ప్రభాతవార్త :** నర్సాపూర్ మండల పరిషత్‌లో మండల పరిషత్ సాదారణ సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గ్రామాలోని ప్రజల సమస్యల పరిష్కారానికి మండల సమావేశాలు నిర్వమిస్తున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిషత్ సమావేశ మందరంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్ అధ్యక్షతనలో మండల సాదారణ సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఈ సమావేవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు ఈసందర్భంగా ఈ సమావేశంలో ముందుగా వివిద ప్రభుత్వశాఖల అధికారులు తమ శాఖ పరంగా గ్రామాల్లోని ప్రజలకుఅందిస్తున్న సేవలను ఒక్కొక్కరిగా వివరించారు. ఈ సమావేశంలో ఎంఈవో బుచ్యానాయక్ మాట్లాడుతున్న సమయంలో ఎంపిటీసి ఆంజనేయులుగౌడ్ కలుగ జేసుకొని ప్రైవేటు పాఠశాలలో విచ్చల వడిగా పుస్తకాలు, డ్రెస్సుల పేరిట అధికంగా డబ్బులు వసూలు చేస్తునప్పటికి విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.ఈవిదంగా అ్దికంగా డబ్బులు వసూలుచేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో బుచ్యానాయక్ తెలిపారుఅనంతరం మండల తహశీల్దార్ కమలాద్రి మాట్లాడుతున్న క్రమంలో ఎంపిటిసీలు ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్‌గుప్తలు కలుగ జేసుకొని నర్సాపూర్‌లో మండల పరిషత్ చెందిన భూములను అక్రమణలకు గురికాకుండా సర్వేను నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా విధ్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ మాట్లాడుతున్న సమయంలో సభ్యులు మాట్లాడుతూ విధ్యుత్ శాఖ కు సంబందించిన మెటిరియల్ ను సిద్దిపేట నుండి కాకుండా సంగారెడ్డి కి మార్చాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ఈ సమావేశానికి హాజరుకాని ప్రభుత్వ అధికారుల పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపిడివో మధులత కు సూచించారు.ఈ సమావేశంలో ప్రధాన మైన బిటి రోడ్డు డిబెట్, గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు, హరిత హారానికి సంబందించి గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడ లేని విదంగా తెలంగాణాలో ని హైద్రాబాద్‌లో పెద్ద ఎత్తున చెట్లను నాటి హరిత హారాన్ని అనుకున్న విదంగా అమలు చేయడంతో ప్రపంచంలోనే గ్రీన్ నెట్స్ సిటిగా హైద్రాబాద్ కుఅవార్డు లబించిందన్నారు. ఈ మేరకు ఇప్పటి ప్రభుత్వం హరితహారం పథకాన్ని వన మహోత్సవం పేరును మార్చారని అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేవిదంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు.ఐదు సంవత్సరాల పదవీ కాలంలో ఎంపిటిసీలు ప్రజలకుఅందించిన సేవలు మరువలేనివని అన్నారు. పదవీ పోయినంత మాత్రాన ప్రజలకు సేవలందించడం ఎంపిటిసీలు మరువరాదని అన్నారు.అనంతరం ఎంపిటిసీ సభ్యులను ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా శాలూవాలతో, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, జడ్‌పిటిసీ బాబ్యనాయక్,నర్సాపూర్‌మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రకాజుయాదవ్, ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగరావు, మండల తహశీల్దార్ కమలాద్రి, ఎంపిడివో మధులత, ఎంపివో వైద్యం శ్రీనివాస్, వివిద ప్రభుత్వ శాఖల అధికారులు ఎంపిటీసిలు పాల్గొన్నారు.

**వివాహేతర సంబంధం కారణంతో....**

# కారుతో ఢీకొట్టి మహిళ హత్య

**ఉప్పల్ భగాయత్‌లో ఘటన**

**ఉప్పల్, జులై 1 ప్రభాతవార్త :** వివాహేతర సంబంధం కారణంగా ఒక మహిళను కారుతో ఢీకొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ శ్రీనగర్‌కాలనీలో నివసించే పెన్నెం చంద్రమౌళి 47ఎన్ఎస్ఎస్ రియల్‌ఎస్టేట్ సంస్థలో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అదేప్రాంతంలోని శ్రీనివాస పురం కాలనీలో నివసించే కొమ్మవారి మంజుల 40తో పరిచయం ఏర్పడింది. అప్పటికే మంజుల భర్త నరసింహ మృతి చెందడంతో మంజుల, చంద్రమౌళి ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్ పేరుతో కారులో తిరిగే వారని పోలీసులు తెలిపారు. కాగా మంజులకు గత మూడు సంవత్సరాల నుంచి చంద్రమౌళితో వివాహేతర సంబంధం ఉందని, ఇద్దరు కలిసి వ్యాపార లావాదేవిలు కూడా ఉన్నాయని తెలిపారు. కాగా ఇద్దరి మధ్య ఆర్థికపరమైన విషయాల్లో తేడాలు ఉండడంతో పాటు, మరో వ్యక్తితో ఆమె చనువుగా ఉండడంతో చంద్రమౌళి ఎలాగైనా మంజులను హత్య చేయాలని పధకం పన్నాడు. ఆదివారం రాత్రి ఇద్దరు కలిసి మద్యం తాగి కారులో ఉప్పల్ భగాయత్ వద్దకు వచ్చారు. నిర్మానుష ప్రాంతంలోకి వెళ్లిన తర్వాత ఆమెను కారు నుంచి కిందకు దింపి కారుతో ఢీ కొట్టినట్లు తెలిపారు. కారు మహిళపై నుంచి పలుమార్లు వెళ్లడంతో శరీరం చిద్రం అయినట్లు పోలీసులు తెలిపారు. హత్య చేసిన అనంతరం నిందితుడు స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మహిళకు 19 ఏళ్ల కుమార్తెతోపాటు, పదేళ్ల ఒక కుమారుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోస్టల్ శాఖలో గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు : జాటోతు హుస్సేన్ నాయక్

**చిక్కడపల్లి, జులై 1 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పోస్టల్ శాఖలో గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని పోస్టల్ కన్వెన్షన్ సెంటర్‌లో పోస్టల్ గిరిజన సంక్షేమ సంఘం తెలంగాణ సర్కిల్‌నిర్వహణలో జటోతు హుస్సేన్‌నాయక్ అభినందన సత్కార కార్యక్రమం అసోసియేషన్ వ్యవస్థాపకుడు గుగులోతు రవినాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జాటోతు హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గిరిజనుల సమస్యలు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించే విధంగా కృషి జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశలో ప్రయత్నాలు కూడా ముమ్మరం చేస్తామన్నారు. రవినాయక్ మాట్లాడుతూ పోస్టల్ శాఖలో 2021లో తెలంగాణలో ఎస్టీ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం పదోన్నతులు, బదిలీలు, జీడీఎస్ ఉద్యోగుల సమస్యలు వంటి పలు అంశాలపై ప్రస్తావించారు. డిపార్ట్‌మెంట్‌లో బోగస్ ఎస్టీ సర్టిఫికేట్‌పై ఉద్యోగాలు చేస్తున్న వారిపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఉందని, ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా జాతీయ స్థాయిలో ఆలిండియా ఎస్సీ,ఎస్టీ సంక్షేమ సంఘాన్ని విభజించి ఎస్టీలకు ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని హుస్సేన్‌నాయక్‌ను కోరారు. ఈ సందర్భంగా బంజారా భాషలో భగవత్‌గీత రాసి పద్మశ్రీ అవార్డు అందుకున్న కేతావ్ సోమ్లానాయక్, కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారగ్రహీత రమేశ్ కార్తీక్ నాయక్‌లను సత్కరించారు.భుక్యా కృష్ణ, హనుమంతు, లావుడ్య సైదా, భూక్యా వెంకన్న, భూక్యా దాసు, పి.నాగరాజు, రాజు జైసింగ్, మాలోతు సంతోష్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**రవీంద్రభారతి, జులై 1 ప్రభాతవార్త :** మానవులకు ఆరోగ్యప్రధాత సూర్యభగవానుడైతే ప్రాణ ప్రధాత వైద్యుడని, పుట్టుక నుండి గిట్టేవరకు అందరికీ అవసరమైన ఒకేఒక వ్యక్తి డాక్టర్ అన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యాంప్రసాద్ ఇటువంటి వైద్యులను గౌరవించి సకల సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వాల బాధ్యతను గుర్తుచేసేదే వైద్యుల దినోత్సవమని స్పష్టం చేశారు. అన్ని వృత్తులకంటే వైద్యవృత్తి చాలా కష్టమైన క్లిష్టమైన వృత్తి అని, తమ, కుటుంబ జీవితాలను ఫణంగా పెట్టి సమాజంలోని మనుషుల ప్రాణాలను అహర్నిశలు కాపాడుతుంటారని, వారి చలువతోనే మనమంతా సుఖసంతోషాలతో మనుగడ సాగించుతున్నామని వైద్యుల సేవలను కొనియాడారు. నవకళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.మల్లికార్జున్ రావు, కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, సాయికుమార్ తమవంతు బాధ్యతగా నిష్ణాతులైన సమాజసేవకులైన 36మంది వైద్యులను ఎంపికచేసి వైద్య శిరోమణి అవార్డులతో సత్కరించడం ఎంతో అభినందనీయమని వారిని ప్రశంసించారు. నవకళావేదిక ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ జి.శ్యాంప్రసాద్ విశిష్ట అతిథులు డి.కె.రెడ్డి, డా. కె.శంకర్‌రావు, ఈస్తర్‌వర్మ, డి.ఎల్.పాండు, శ్రీధర్‌కుమార్, కె.ఈశ్వర్‌చారి, ఎ.మల్లికార్జున్‌రావు తదితరులతో కలిసి 36మంది వైద్యులను ఘనంగా సత్కరించి వైద్యశిరోమణి అవార్డులను ప్రదానంచేసి శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మూసాపేట, జులై 1, ప్రభాతవార్త :** రాంగ్‌రూట్లో ద్విచక్ర వాహనం నడుపుతూ ఆర్టీసీ బస్‌ను ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీలతరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తునికి చెందిన చిన్నారావు (40) కుటుంబంతో కలిసి నిజాంపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పనినిమిత్తం హైదర్‌నగర్‌కి ద్విచక్రవాహనంపై వచ్చి రాంగ్ రూట్‌లో రోడ్ దాటేందుకు యత్నించాడు. ఈ క్రమంలోనే వేగంగా వస్తున్న ఉప్పల్ డిపోకు చెందిన ఏపీ25 జెడ్3620 నెంబర్ గల ఆర్టీసీ బస్‌ను ఎదురుగా వెళ్లి ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలు పాలైన చిన్నారావును స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భారత నూతన న్యాయ చట్టాల పుస్తకాల పరిచయం

**నర్సాపూర్, జులై 1, ప్రభాతవార్త :** పట్టణంలోని కోర్టు ఆవరణలో సోమవారం జూనియర్ సివిల్ జడ్జి, న్యాయమూర్తి కె.అనిత ఆధ్వర్యంలో భారత నూతన న్యాయ, చట్టాల పుస్తకాలను పరిచయం చేయడం జరిగింది.ఈ సందర్భంగా న్యాయమూర్తి కె.అనిత మాట్లాడుతూ పార్లమెంట్ నూతన న్యాయ చట్టాలను అమలు చేసినందున నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదుల సమక్షంలో నూతన భారత న్యాయచట్టాల పుస్తకాలను పరిచయం చేయడం జరిగిందన్నారు. దండన కాదు న్యాయం ముఖ్యం అనే ఉద్దేశంతో దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చిందన్నారు. ఈ మేరకు భారత పార్లమెంట్ అమలులోకి తీసుకువచ్చినటువంటి భారత నూతన న్యాయచట్టాలు మార్పులు, చేర్పులు చేయబడినవని తెలిపారు. ఈమేరకు పాతచట్టంలో పపిసి ని కొత్తచట్టంలో బిఎన్ఎస్ అని రూపు దిద్దుకుందన్నారు. అలాగే పాత చట్టం ఐఈఏను బిఎస్ఏగా మార్చిందన్నారు. పాత చట్టం సిఆర్‌పిసి నిబిఎన్ఎస్ఎస్‌లుగా నూతన చట్టాన్ని అమలుల్లోకి తీసుకువచ్చిందని తెలిపారు. భారత పార్లమెంట్ ప్రతిష్టాత్మకంగా ఆమోదించి అమలు చేయడం జరిగిందన్నారు.స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా భారత ప్రభుత్వం స్వదేశీ చట్టాలను తేవాలనే సంకల్పంతో స్వదేశీ చట్టాలను అమలులలోకి తీసుకువచ్చారని అన్నారు.చట్టంలో దండన కంటే న్యాయం ముఖ్యమనిపేర్కొంటు గతంలో పోలీసు హక్కులకు మాత్రమే రక్షణ ఉండేవని ఈ భారత నూతన న్యాయ చట్టాల ద్వార ఇప్పుడు బాధితుల, ఫిర్యాదారుల హక్కులకు రక్షణ ఏర్పడిందన్నారు.ఈ మేరకు నర్సాపూర్‌లో భారత నూతన న్యాయ చట్టాల పుస్తకాలను పరిచయ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలోఏపిపి రాఘవేంద్ర, ఏజిపి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, బార్‌అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ బార్ ప్రసిడెంట్ అంజిరెడ్డి,సీనియర్ న్యాయవాదులు జి.శ్రీనివాస్ గౌడ్, ఏ.శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, కె. ప్రకాష్, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి,న్యాయవాదులు రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఒయు నూతన జాయింట్ రిజిస్ట్రార్‌కు ఘనసన్మానం

**తార్నాక, జులై 1 ప్రభాతవార్త:** ఓ.యూలో సుదీర్ఘంగా డిప్యూటీ రిజాస్టార్‌గా పనిచేసి జాయింట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందిన ఎం.శ్రీనివాస్‌ను ఒ.యూ ఎన్జీవోస్ మాజీ ప్రధాన కార్యదర్శి ఖధీర్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖదీర్ ఖాన్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన శ్రీనివాస్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, బ్లాక్ గ్రాంట్స్, ఇసి,ఎఫ్‌సిలల్లో కీలక పాత్ర పోషించి యూనివర్సిటీకి ఒక బ్యాక్ బోన్‌గా పని చేసి ఫైనాన్స్ సపోర్టర్‌గా కీలకపాత్ర పోషిస్తున్తూ ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖధీర్ ఖాన్, బి.వెంకటేష్, యాదగిరి, సుధీకర్ కుమార్, నరసింహ్మ, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోల్-3 : మంచిరేవులలో తన తల్లిపేరుతో మామిడి మొక్కను నాటుతున్న మాజీ ఎమ్మెల్సీ, జాతీయ బిజెపి నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి.

## మంచిరేవులలో మొక్క నాటిన పొంగులేటి సుధాకర్‌రెడ్డి

**నార్సింగి, జులై 1 ప్రభాతవార్త:** గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో బిజెపి జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తల్లి పేరున ఓ మామిడి మొక్కను నాటారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మామిడి మొక్కను నాటినట్లు సుధాకర్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణీకరణ కారణంగా ఏటేటా ప్రాణవాయువును ఇచ్చే అడవులు, వృక్షాలను నరికివేస్తూ, కాలుష్యాన్ని పెంచే కోట్లాది వాహనాలను రోడ్లపై తిప్పుతుడడం వలన వాతావరణం వేడెక్కిందన్నారు. మన దేశంలో 140.కోట్ల మంది జనాభా ఉన్నారని, తమ తల్లి, బిడ్డల పేర్లపై ఒక్కొక్కరూ రెండు మొక్కలు నాటి, మూడేళ్ల పాటు అవి పెరిగేలా సంరక్షణ చేస్తే 300.కోట్ల చెట్లు పెరుగుతాయన్నారు. నామమాత్రంగా మొక్కలు నాటి వదిలేయకుండా అవి పెరిగి పెద్దయ్యేలా నిత్యం నీరు, ఎరువు వేస్తుండాలన్నారు. అడవుల శాతం తగ్గడం వల్లనే ఇప్పుడు వేసవిలో 50.డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, పరిస్థితి ఇలాగే ఉంటే మరో పదేళ్లలో 56.డిగ్రీలకు చేరుకునే ప్రమాదముందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారన్నారు. ఇంతలోనే మనమంతా మేల్కొని చెట్లను పెంచుకుంటే వాతావరణంలో కాలుష్యం తగ్గిపోతుందని, వాతావరణం చల్లబడుతుందని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని పొంగులేటి సుధాకర్‌రెడ్డి సూచించారు. ప్రతీ ఒక్కరూ విధిగా రెండు మొక్కలు నాటాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. వసుదైక కుటుంబం తత్వాన్ని అనుసరిస్తున్నందుకు భారతదేశంను యావత్ ప్రపంచం అభినందిస్తుంటే... మన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంకుచిత రాజకీయాల కోసం మతపరమైన హింసను సృష్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

## ట్రైనింగ్ ఇచ్చారు.. లక్షలు దోచేశారు

**ఫారిన్ ఎక్సేంజ్ కరెన్సీ పేరుతో మోసం**

**హైదరాబాద్, జులై 1, ప్రభాతవార్త:** ఫారిన్ కరెన్సీని కొనే నెపంతో నగరానికి చెందిన వ్యాపారి(41) వద్ద సైబర్ దొంగలు రూ.8 లక్షలు దోచేసిన ఘటన తాజాగా వెలుగు చూసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్‌పోలీసుల వివరాల ప్రకారం, ఆన్‌లైన్ మోసాల్లో తరచూ చేసే చోరీ పద్దతికి భిన్నంగా నిందితులు తమంతట తామే బాధితుడికి రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి తొలుత లాభాల్లో వాటా ఇచ్చారు. మోసానికి మునుపు ఫారిన్ కరెన్సీ ట్రేడింగ్‌లో శిక్షణ ఇవ్వడమే కాకుండా పెద్దమొత్తంలో ఆరంభ పెట్టుబడితో బాధితుడి నమ్మకాన్ని చొరగొని, వర్క్ పేరుతో అతడి చేత ఫారిన్ కరెన్సీ కొనిపించారు. సైబర్ దొంగలు పంపిన లింకు ద్వారా బాధితుడు ఇన్‌స్టాల్ చేసుకున్న ఎక్స్‌టీబీ ఫారిన్ కరెన్సీ ట్రేడ్ యాప్‌లో లాభాలు కనిపించడంతో, అతడు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఎంత ప్రయత్నించినా యాప్ లోని లాభాల్లో నగదు తన ఖాతాకు ఉపసంహరణ కాకపోవడంతో, తనకి ట్రైనింగ్ ఇచ్చిన సదరు నిందితులని ఫోన్లో సంప్రదించగా, వారు మరికొంత ఫారిన్ కరెన్సీని కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం యూరోపియన్ కరెన్సీ పేరుతో బాధితుడి నుంచి మరో విడత డబ్బులు దండుకున్నారు. ఇలా ఎక్స్‌టీబీ ఫారిన్ కరెన్సీ యాప్‌లో బాధితుడు డిపాజిట్ చేసిన నగదు రూ.8,90,000 మొత్తాన్నీ తమ ఖాతాకు బదిలీ చేసున్నారు. ఇక అతడు పెట్టుబడి పెట్టడని నిర్ధారించుకున్న తక్షణమే బాధితుడిని బ్లాక్ చేసి మాయమయ్యారు. దాంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫారిన్ కరెన్సీ పేరుతో సైబర్ నేరగాళ్ళు చేసేది ట్రేడింగ్ మోసమేనని, వాళ్ళు ఆరంభ పెట్టుబడి పెట్టినా ప్రజలు మోసపోవద్దని సూచించారు.



మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్, రవిశంకర్, బిక్కికృష్ణ,

## కొలకలూరి సాహిత్యాన్ని డిజిటలైజేషన్ చేయాలి : కంఠంనేని రవిశంకర్

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 28 ప్రభాతవార్త :** కొలకలూరి ఇనాక్ సాహిత్యం గురించి సుదీర్ఘమైన చర్చ జరగాలని, ఆయన సాహిత్యాన్ని, జన్మదిన సందర్భంగా వచ్చిన కవితల్ని డిజిటలైజేషన్ చేయాల్సిన అవసర ముందని తెలుగువన్ వ్యవస్థాపకుడు, సినీనిర్మాత రవిశంకర్ అన్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ప్రపంచాన్ని, ముఖ్యంగా ప్రాంతీయ, కుల, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ప్రేమించడం మొదలు పెడితే రాగద్వేషాలు ఉద్భవించవని, కవులు అందర్నీ ప్రేమిస్తే ఆ ప్రేమ తిరిగొస్తుందని, మంచిమార్పు వస్తుందని, అన్నింటికంటే ప్రముఖంగా సాహిత్యంలో చెప్పదలచుకొన్నది ఆచరణలో చేసిచూపించాలని హితవుపలికారు. మహర్షివాల్మీకి సాంస్కృతిక సేవాసంస్థ, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార స్వీకర్త, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ 86వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కొలకలూరి ఇనాక్ సాహిత్యం-సమాలోచన; గురుదేవోభవ అంశంపై కవిసమ్మేళనం కార్యక్రమాలు సోమవారం ఉదయం వైభవోపేతంగా జరిగాయి. డా. వి.డి.రాజగోపాల్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కంఠంనేని రవిశంకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి గౌరవ అతిథులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొనగా కొలకలూరి ఇనాక్ సాహిత్యం-సమాలోచనలో డా. బిక్కికృష్ణ ఇనాక్ కవిత్వం, డా. జెల్ది విద్యాధర్ ఇనాక్ విమర్శ సాహిత్యం, శ్రీనివాస్‌గౌడ్ కథాసాహిత్యం, డా. రాధాకుసుమ ఇనాక్ నాటక సాహిత్యం, డా. భారతి ఇనాక్ నవలా సాహిత్యంపై సవివరంగా ప్రసంగించారు. తదుపరి అతిథుల చేతులమీదుగా 18మంది సాహితీవేత్తలను ఘనంగా సన్మానించి కొలకలూరి ఇనాక్ జాతీయ సాహిత్య పురస్కారాలను ప్రదానంచేసి అభినందించారు. గురుదేవోభవ అంశంపై రవీంద్రబాబు నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనంలో 40మంది కవులు పాల్గొని అద్భుతమైన కవితాగానం కావించి ఆహుతులను ఆకట్టుకున్నారు.

## వైభవంగా భారతరత్న పివి జయంతి

**నాంపల్లి, జులై 1 ప్రభాతవార్త :** సమాజంలో త్యాగం తగ్గిపోయి భోగం పెరిగిపోయింది.. ఎప్పుడైతే కృతజ్ఞతాభావం తగ్గిపోయిందో కృతఘ్నుతాభావం పెరిగిపోయింది... ఎక్కడైతే విశ్వాసం తగ్గిపోయిందో మోసం పెరిగిపోయింది... బాంధవ్యం తగ్గిపోయిందో ద్రవ్యవిలువ పెరిగిపోయింది.. ఎప్పుడైతే మనం కళలు కళాకారులు ప్రతిభా సాహిత్యం పెరగాలనుకొన్నపుడు అప్పుడు వలవేసి లాక్కుపోయే స్థితి ఏర్పడిందని, ప్రచారవ్యక్తివుంటే చాలన్న దుస్థితికి సమాజం చేరుకొందని, ఇంత గొప్పటి భాషానిలయంలో జరిగే కార్యక్రమానికి ఆదరణ కరువైపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇవన్నీ నీరు పల్లెమెరుగు అనే నానుడిని నిజం చేస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భారతరత్న మన పివి నరసింహారావుకు రావడం యావత్ తెలుగుజాతితోపాటు దక్షిణ భారతదేశానికే గర్వకారణమని పివి సేవలను కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో రావిచెట్టు రంగారావు సభామందిరంలో భారత పూర్వప్రధాని, భారతరత్న పి.వి.నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన పాఠశాలస్థాయి విద్యార్థుల వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన భాషానిలయం గౌరవ అధ్యక్షుడు టి.ఉదయవర్లు నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు విశిష్ట అతిథులు కె.చంద్రప్రకాశ్‌రావు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, డా. కె.సరస్వతి, డా. విజయసామరాజు, పి.వి.ప్రభాకర్ తదితరులతో కలిసి పి.వి చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి దేశానికి పివి అందించిన అశేషసేవలను కొనియాడి వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానంచేసి శుభాశీస్సులందజేశారు.

## గవర్నర్‌ను కలిసిన తెలంగాణ తమిళ సంఘం ప్రతినిధులు

**చిక్కడపల్లి, జులై 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరంలో గత కొన్ని దశాబ్దాల నుంచి వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న తమిళ ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు తమిళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలను తెలంగాణ తమిళ సంఘం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ సిపి.రాధాకృష్ణన్ అన్నారు. సోమవారం తెలంగాణ తమిళ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్ నేతృత్వంలో ప్రతినిధి బృందంలో ఉపాధ్యక్షుడు ధర్మశీలం, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజ్‌కుమార్, కోశాధికారి ఎన్.నెహ్రూ శాస్త్రి, ఉపకోశాధికారి టి.కుమారరాజన్ తదితరులున్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు నగరంలోని తమిళ సమాజంల సంబంధించిన ప్రాధాన్యతలను వివరించారు. తమిళభవన్ నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించడంతో పాటు నిధులను మంజూరు చేయాలని, స్కూళ్లలో మొదటి భాషగా తమిళాన్ని ప్రవేశపెట్టాలని, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చైన్నైవరకు వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌ను కన్నాకుమారి వరకు పొడగించాలని, ఫలితంగా ప్రధాన దేవాలయాలైన చిదంబరం, కుంభకోణం, తంజావూర్, మధురై ప్రాంతాల దేవాలయాలను సందర్శించే అవకాశం ఉంటుందని గవర్నర్‌కు వివరిఇంచారు. రాష్ట్రప్రభుత్వానికి తగిన విధంగా సూచనలిస్తూ తమిళ సమాజం పురోభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తామని గవర్నర్ సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

## సిఎం రేవంత్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీఠ : లతాగౌడ్

**నార్సింగి, జులై 1 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీఠ వేస్తున్నారని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ కార్పొరేషన్ గంధంగూడలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్‌తో కలిసి ఆమె విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన బోధన అందేలా సీఎం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు.పాఠశాలల ప్రారంభ సమయంలోనే పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయించారన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని, అన్నదాతలకు త్వరలోనే రూ.2లక్షల ఋణమాఫీ చేయబోతున్నారని వివరించారు. రేవంత్‌రెడ్డి తనదైన మార్క్ పాలన కొనసాగిస్తూ ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, సయ్యద్ ఖాజా, పాటశాల అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవుల శ్మశానవాటికలో బోర్ వేయించిన చైర్‌పర్సన్

**నార్సింగి, జులై 1 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల వీర శైవుల స్మశాన వాటికలో సోమవారం చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ నూతన బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మశాన వాటికలో మౌళిక వసతులన్నీ కల్పిస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిషలు కష్టపడుతున్నామని వివరించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మంచినీరు, డ్రైనేజి, వీధి దీపాలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, స్మశాన వాటికల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాలికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల,మత,రాజకీయాలకు తావులేకుండా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు లంకల పద్మ వీరారెడ్డి, కోటిగారి ఉషారాణి, డిఇ నర్సిహ్మారాజు, మాజీ వారునడ సభ్యులు దామోదర్‌రెడ్డి, స్థానికులు విశ్వనాథ్, వినోద్, బబ్లు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పటిష్టతకు కృషి చేస్తా : మంకిడి స్వామి

**రాయపోల్, జులై 1 ప్రభాతవార్త :** బిజెపి పటిష్టతకు కృషి చేస్తానని ఎస్సీ మోర్చా మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జ్ మంకిడి స్వామి అన్నారు.ఇటీవల ఎస్సీ మోర్చా మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించినందుకు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావును కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అధ్వాన్నంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ..!

### ప్రజావాణిలో బిజెపి ఫిర్యాదు : స్పందించిన అధికారులు



ప్రజావాణిలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నేతలు

**ఉప్పల్, జూలై 1 ప్రభాతవార్త :**ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, డ్రైనేజీ సమస్య ఏళ్ల తరబడి అలాగే ఉందని పలువురు బిజెపి నేతలు సోమవారం ప్రజావాణిలో డిసి అంజనేయులు, జలమండలి జిఎం సంతోష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిజెపి డివిజన్ అధ్యక్షుడు గోనె శ్రీకాంత్, నేతలు రామరాజు యాదవ్,బీరప్పగడ్డకాలనీ అధ్యక్షుడు శివకుమార్, లక్ష్మీనారాయణ, నరసింహా యాదవ్, షేక్ హాసన్, కిరణ్‌కుమార్‌లు ప్రజావాణిలో పిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీరప్పగడ్డలో నిరుపేదలు అధికంగా నివసిస్తున్నారని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని ఫిర్యాదు చేశారు. బడా నేతలు నివసించే కాలనీలలో రోడ్లు తవ్వి కొత్త రోడ్లు వేస్తున్నారని, పేదలు ఉండే కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్య పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, కమ్యూనిటిహాల్ వద్ద మురుగు నీటితో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని పేర్కొన్నారు. కలుషిత జలాలు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై డిసి స్పందిస్తూ అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్య తక్షణమే పరిష్కరించాలని జిఎం సంతోష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు మణికంఠ, మహ్మద్ సికందర్, వై.శ్రీధర్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డ క్షేమం : కౌన్సిలర్ మంగమ్మ శివకుమార్



పిల్లల బరువులను చూస్తున్న కౌన్సిలర్ మంగమ్మశివకుమార్ తదితరులు

**తుర్కయంజాల్, జూలై 1 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ 21వ వార్డు శ్రీరామనగర్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు బరువు ఎత్తు మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకుర్మా మంగమ్మ శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలు అందరికీ బరువు ఎత్తు కొలతలు తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల్లో ఆకస్మికంగా బరువు పెరగడం, తగ్గడం సర్వసాధారణమయ్యాయని, పిల్లలకు ఇచ్చే ఆహారంలో పోషకాలు సమతుల్యంగా వుండేవిధంగా చూసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా పరిపుష్టిగా ఎదుగుతారని అన్నారు. అంగన్వాడి నుండి వచ్చే గుడ్లు, బాలామృతం, నెయ్యి, గర్భిణీలకు, బాలింతలకు, పౌష్టికాహారం అందించాలంటూ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళ్యాణి, అంగన్‌వాడీ టీచర్స్ మేతరి స్వప్న తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దేవాలయాల వద్ద దీపాలు ఏర్పాటు చేయాలి : కార్పొరేటర్ కొత్తకాపు అరుణ



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** రాబోయే బోనాల పండుగకు సైదాబాద్ డివిజన్‌లోని అన్ని దేవాలయాల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారులతో సోమవారం సమీక్షను నిర్వహించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బోనాల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, సూపర్‌వైజర్ రవి, లైన్మెన్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధే తమ ధ్యేయం : అబ్రార్



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, జూలై 1 ప్రభాతవార్త :** అజంపుర డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ ధ్యేయంగా డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని అజంపురవద్ద నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు,సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ లక్ష్యమన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడంకోసం నిత్యం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్‌కు ఘన సన్మానం



ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌ను సన్మానిస్తున్న రమేష్

**నాచారం, జూలై 1 ప్రభాత వార్త :** ఇటీవల నూతనంగా నాచారం ఇన్స్‌పెక్టర్‌గా పదవీ భాధ్యతలను స్వీకరించిన ఇన్స్‌పెక్టర్ రుద్వీర్‌కుమార్‌ను సోమవారం దళిత జన సమితి (డిజేఎస్‌స) రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు, దళిత జన కార్మిక జన విభాగం రాష్ట్ర ఇంచార్జ్(డిజెకెవి) బొజ్జ రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిజేఎస్ నాయకులు ఇప్పల కుమార్, సంయజ్ కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తాం: కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జులై 1 ప్రభాతవార్త:** కాలనీలు, బస్తీలలో సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ, పద్మావతికాలనీ, సాయినగర్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శుభోదయ కాలనీలో కమ్యూనిటీ హాలు భవనాన్ని నిర్మించాలని, అంగన్‌వాడీ కేంద్రాన్ని, భస్తీ ధవాఖానాను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... మొదటి ప్రాధాన్యతగా బస్తీ ధవాఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. మిగిలిన సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. పద్మావతికాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఎక్కడ చూసినా చెత్తచెదారంతో అనారోగ్య వాతావరణం నెలకొందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయగా..పారిశుద్ధ్య కార్మికుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో చర్యలు తప్పవని కార్మికులను హెచ్చరించారు. రోడ్లపై మట్టి పేరుకుపోయి బురదమయంగా మారుతోందని వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారని తెలుసుకుని వెంటనే వాహనాన్ని తెప్పించి రోడ్డుపై మట్టి సమస్యను పరిష్కరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలుస్వీకరించిన ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ హేమంతా కేశవ్‌పాటిల్‌ను కార్యాలయంలో కలిసిన ఆయన డివిజన్‌లోని సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సబితారెడ్డి ఆదేశాలతో సమస్య పరిష్కారం



కార్మికులు, గల్ఫర్‌తో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ అనిల్ యాదవ్

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఆర్‌సిఐ రహదారి పక్కన గల సర్వీసు రోడ్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్య మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చొరవతో పరిష్కారమైంది.ఆదివారం తన క్యాంపు కార్యాలయంనుండి తిరిగి వెళ్తున్న క్రమంలో రోడ్డులో డ్రైనేజీ ప్రవహించడాన్ని గమనించిన ఆమె వెంటనే కారు దిగి సమస్యను పరిశీలించి అప్పటికప్పుడు కార్పొరేషన్ డిఇఇ వెంకన్నతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రంగంలో దిగిన కార్పొరేషన్ పారిశుద్ధ్య సిబ్బంది గల్ఫర్ మెషిన్‌తో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో నుండి రాళ్లు రప్పలు, చెత్తా చెదారాన్ని స్థానిక 16వ డివిజన్ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ దగ్గరుండి మరీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన డివిజన్‌కు ఆనుకొని ఉన్న జిహెచ్‌ఎంసి హస్తినాపురం డివిజన్‌కు సంబంధించిన ధాతునగర్ డ్రైనేజీ లైన్ పొంగిపొర్లి ఆర్‌సిఐ రహదారిలోని తన డివిజన్ కిందకు వచ్చే విజయపురి కాలనీ రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు కలిగించిందని వెల్లడించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జూలై 1 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ హరిహరపురం కాలనీలో డాక్టర్ డి సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ సాయి నేత్రాలయ కంటి ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమని కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు జనార్దన్‌రెడ్డి, శంకర్ గౌడ్, స్వతంత్రరెడ్డి, సంజీవరెడ్డి, డి.రాములు, పార్టీ చేనేత మోర్చా కన్వీనర్ రఘురాం నేత తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ ఓపెన్ ల్యాండ్‌లో జరుగుతున్న నిర్మాణాలపై విచారణకు బిజెవైఎం వినతి

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌కిందకు వచ్చే మారుతీనగర్ కాలనీ రోడ్ నెం 3లో కాలనీకి సంబంధించిన ఓపెన్‌ల్యాండ్‌లో జరుగుతున్న నిర్మాణాలపై విచారణ జరపాలని కార్పొరేషన్ బిజెవైఎం అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ కార్యాలయానికి దగ్గరలోనే భారీఎత్తున జరుగుతున్న నిర్మాణాలపై పూర్తి స్థాయిలో ఎంక్వయిరీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సదరు కాలనీ ఓపెన్ ల్యాండ్‌ను ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## అభివృద్ధి పనులను పూర్తి చేసి సమస్యలు లేకుండా చూస్తాం : కౌన్సిలర్ చల్లూరి

**హయత్‌నగర్, జులై 1 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డులో నూతనంగా ఏర్పాటుచేసిన చల్లూరి దయాకర్‌రెడ్డికాలనీ శిలాఫలాకాన్ని స్థానిక కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానమైన డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని పనులను కూడా కొనసాగుతున్నాయని వివరించారు. దశలవారిగా అభివృద్ధిపనులను పూర్తిచేసి కాలనీల్లో సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పండుగుల జయశ్రీరాజు, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని దిష్టి బొమ్మ దగ్ధం

**ఎల్.బి.నగర్, జూలై 1 ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ పార్టీ భీ ఫామ్‌పై గెలిచిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీలోకి రాబోతున్నారనే సమాచారం రావడంతో ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని సోమవారం కొత్తపేట చౌరస్తాలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 2వ సారి జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ప్రధాన ప్రతిపక్ష పాత్రను తెలంగాణ సమాజం కట్టబెట్టిందని, మల్లు భట్టి విక్రమార్కను కాంగ్రెస్ ప్రతిపక్ష నేతగా దళిత నాయకుడు ఉండడాన్ని జీర్ణించుకోలేని సబిత ఆనాడు సిఎల్పీని టిఆర్‌ఎస్ పార్టీలో విలీనం చేయడంలో ప్రముఖమైన పాత్ర పోషించారని ఆరోపించారు. మంత్రి పదవి అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ నాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించిన సబిత నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని అధిష్టానానికి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధుసూధన్ రావ్, నల్లెంకి ధనరాజ్‌గౌడ్,తలాటి రమేష్‌నేత, నానవాల జ్ఞానేశ్వర్‌యాదవ్, పెద్దవూర సైదులు, దుబ్బాక శేఖర్, అక్బర్, కళ్యాణ్, నాభీ, పాషా, అల్లావుద్దీన్ పటేల్, ముప్పిడి లింగస్వామిగౌడ్, పగడాల ఎల్లన్న, రంజిత్, రేణుక, శ్వేత, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల సేవలు వెలకట్టలేనిది : ఉప్పల



వైద్యులను సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ఎల్.బి.నగర్, జూలై 1 ప్రభాతవార్త :** వైద్యులు చేస్తున్న సేవలు వెలకట్టలేనిదని రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ నిస్తారని అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా నాగోల్ సుప్రజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సుప్రజ హాస్పిటల్ నుండి స్వాగత్ గ్రాండ్ హోటల్ వరకు నిర్వహించిన 3కే రన్ కార్యక్రమాన్ని ఉప్పల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు కోవిడ్ సమయంలో చేసిన సేవలు వెలకట్టలేనిదని కొనియాడారు. వ్యాయామానికి ఇలాంటి రన్ ని నిర్వహించాలని ఫిట్నెస్‌తో అందరూ వుండాలని, ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. అనంతరం వైద్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, ఓయూ జెఏసి నాయకుడు బాలలక్ష్మి, ఎక్సైజ్ ఏసిపి గణేష్, వైద్యులు శ్రీనివాస్, విజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ టెంపుల్‌కు రూ.2,22,999 విరాళం ఆలయ కమిటీకి అందజేసిన కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి



విరాళం చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి దంపతులు

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ప్రధాన రోడ్డులో పునర్నిర్మాణం జరిగిన గ్రామ ప్రధాన పోచమ్మ ఆలయానికి సోమవారం 41వ డివిజన్ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి సతీమణి అరుంధతో కలిసి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి జిల్లెల దామోదర్ రెడ్డికి రూ.2,22,999ల విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లెలగూడ గ్రామ ప్రజల కొంగు బంగారమైన పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించడం హర్షణీయమని, తన వంతుగా విరాళం అందజేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి కానాల కేమాద్రి, సలహాదారులు బొక్క అంజిరెడ్డి, సప్పిడి యాదిరెడ్డి, కుంటల వల్లభ్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని జడ్‌సికి వినతి



జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

**నేరెడ్‌మెట్, జూలై 1 ప్రభాతవార్త:** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందించారు. కాకతీయనగర్‌ప్రధానరహదారిలో బాక్స్ డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రధాన రహదారి అవ్వడంతో కాకతీయ నగర్ రోడ్డుపై పూర్తిగా వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతేకాకుండా వర్షపు నీటితో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమవుతాయని వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు.

**వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని వినతి..** స్థానికుల కోసం వినాయక్‌నగర్ కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ కమ్యూనిటీ హాల్ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారి సత్యలక్ష్మి, అధికారులతో కలసి పరిశీలించి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, ఉపాధ్యక్షులు సాయిసురేష్, శ్రీకాంత్ యాదవ్, కార్యదర్శి గోపాల్, కాలనీ వాసులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌కు భూబాధితుల సన్మానం

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడ సర్వే నెంబర్ 2కు చెందిన భూబాధితుల సంఘం నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకుడు గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్స్‌పెక్టర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రె రమేష్, గుడ్ల మహేందర్, రొడ్డ యాదయ్య, క ్రె ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో కార్పొరేటర్ల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

**ఎల్.బి.నగర్, జూలై 1 ప్రభాతవార్త:** సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు.సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత ఆధ్వర్యంలో సోమవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మన్సూన్‌కు సంబంధించి పలువురు అధికారులతో కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్, నాయకోటి పవన్‌కుమార్, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగా నరసింహగుప్తాలు పాల్గొని డివిజన్ పరిధిలోని పలు సమస్యలను గురించి అధికారులకు వివరించారు. భారీవర్షాలు కురిస్తే కాలనీలు ముంపుకు గురయ్యే ప్రమాదముందని, ముంపు ప్రాంతాలను గుర్తించి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గుంతల మయంగా మారిన రోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు. జలమండలి అధికారులు భూగర్భ డ్రైనేజీల కోసం రోడ్లన్నీ తవ్వి పనులు అయిపోయాక వాటినకి మరమ్మత్తులు చేయలేదని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లను వెంటనే నిర్మించాలన్నారు. బోనాల పండుగ సమీపిస్తున్న సందర్భంగా కాలనీలలోని దేవాలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నందనవనం ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తెలుపుతున్న ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు ఇతర సిబ్బంది

**వనస్థలిపురం, జూలై 1 ప్రభాతవార్త:** వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ఆసుపత్రి ఆవరణలో నూతన బి.టీ.రోడ్డు నిర్మాణం, లిఫ్ట్ సౌకర్యం, డయాలసిస్ సేవలు మెరుగుపరచడంతోపాటు మంచినీటి సౌకర్యం,కొన్నిచోట్ల డ్రైనేజీ పైప్ లైన్స్ పగిలిపోయాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే లిఫ్ట్ సౌకర్యం గురించి అధికారులచే మాట్లాడామని, డయాలసిస్ సేవలు మెరుగుపరుస్తామని తెలిపారు. మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామని హామీనిచ్చారు. ఆసుపత్రిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పింస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, డాక్టర్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

**నందనవనంలో...** హస్తినపురం డివిజన్ నందనవనం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మూసానగర్)లో 9వ తరగతి డిజిటల్ గదుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇక్కడ ఉన్న అంగన్వాడీ మరొక చోటుకు మార్చాలని, పాఠశాల బిల్డింగ్‌పై రేకుల షెడ్డు వేసుకోవడానికి అనుమతినివ్వాలని కోరారు. అలాగే గతంలో మంజూరైన అదనపు అంతస్థుల నిర్మాణంతోపాటు, అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే సంవత్సరం నుంచి 10వ తరగతి ప్రారంభించడం చాలా గర్వంగా ఉందన్నారు. త్వరలో రెండు అంతస్తుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదనపు సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతనాయక్, మాజీ కార్పొరేటర్ పద్మ శ్రీనివాస్‌నాయక్, డివిజన్ అధ్యక్షులు సత్యంచారి, మహిళాధ్యక్షురాలు ఆదిలక్ష్మి, శ్రీనివాస్ యాదవ్, అనిత, నాగిరెడ్డి, మధు, కిట్టు, అరుణ్, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి



స్కూల్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

**నాచారం, జూలై 1 ప్రభాతవార్త :** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదుగుతారని లెఫ్టినెంట్ కల్నల్ మంజులశర్మ, గౌరవఅతిథి మల్కా కొమురయ్య పేర్కొన్నారు. పల్లవి మోడల్ స్కూల్ 30 అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం స్కూల్ ఆవరణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు లెఫ్టినెంట్ కల్నల్ మంజుల శర్మ, కొమురయ్య పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఆత్మవిశ్వాసంతో బహుముఖ ప్రజ్ఞతో జీవితంలోవచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైనా విద్యార్థికి క్యాబినెట్ లెఫ్టినెంట్ ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థులు తమ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని మంచి నాయకులుగా ఎదగాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మల్కా యశస్వి, స్కూల్ ప్రిన్సిపల్ రేణు చక్రబర్తి, వైస్ ప్రిన్సిపల్ పూజా సక్సేనా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ చైర్మన్‌గా సి.హరిబాబు



చైర్మన్ హరిబాబు, సభ్యులను అభినందిస్తున్న రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, జూలై 1 ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్‌పేట శ్రీరామచంద్రస్వామి ఆలయ చైర్మన్‌గా సి.హరిబాబు, ట్రస్టీలుగా జె.బాలకృష్ణ, రాజేష్, ఉమారాణిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా నియమితులైన హరిబాబు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాఈమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓ మార్తాండ, ఇన్స్పెక్టర్ ఇందిరా, ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, నాయకులు నరేందర్‌ముదిరాజ్, చీపురు రాజారావుగౌడ్, పోల్కం శ్రీనివాస్, రాజు, రామకృష్ణ, టిన్నుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ మారే అవసరం మాజీ మంత్రి సబితమ్మకు లేదు : మురుకుంట్ల అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, జూలై 1 ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ పార్టీ మారే అవసరంగానే ఆలోచనగానే ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డికి లేదని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్‌ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. ఆర్‌కెపురం డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సబితాఇంద్రారెడ్డి పార్టీ మారుతుందని సోషల్ మీడియాలో ప్రచారం చేసి, వారే దిష్టిబొమ్మ దగ్ధం చేయడం కాంగ్రెస్ దిగజారిన రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. పలు వేదికలపై పార్టీ మారడం లేదని స్వయంగా సబితా వెల్లడించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారంతో రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాతీర్పును శిరసావహిస్తూ 5 సంవత్సరాలు ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామన్నారు. హామీల అమలుపై దృష్టి సారించకుండ ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేయడం మానుకోవాలని, గతంలో నియోజక వర్గ అభివృద్ధికీ రూ.240 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు ప్రారంభం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను ఎందుకు ఆపివేసిందని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

## ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు

**ఎల్.బి.నగర్, జూలై 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌బినగర్ జోనల్ కార్యాలయములో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంతకేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, మరొకటి ఇంజనీరింగ్ విభాగానికి చెందిన దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు.